# ఘనంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం

## ● నివాళులర్పించిన కార్పొరేటర్, బిజెపి నాయకులు



ఇది కద నిజం, అత్తాపూర్:హైదర్గూడా చౌరస్తాలో జనతా పార్టీ వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా సెక్రెటరీ కొమురయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దీన్ దయాల్ ఉపాధ్యాయ జనసంఘ్ వ్యవస్థాపక సభ్యులే కాకుండా, బీజేపీ సిద్ధాంతకర్తగా మరియు ఏకాత్మతా మానవతా వాదాన్ని ప్రవచించిన గొప్ప జాతీయవాది అని కొనియాడారు. అంత్యోదయ పథకం ద్వారా సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే సంకల్పంతో పనిచేసిన మానవతావాది ఆయనని పేర్కొన్నారు. భారతీయ సాంస్కృతిక జీవన వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతే పార్టీ అంతఃసూత్రంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. దేశ హితం మరియు సమాజ హితం కోసం సిద్ధాంతాల పునాదుల మీద యావత్ ప్రపంచానికి ఆదర్శవంతమైన పార్టీకి ఆయన ప్రాణప్రతిష్ట చేశారని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కడెం సుధాకర్, రాజశేఖర్, విజయ్, జయనంద్ రెడ్డి, సిదేశ్వర్, రమేష్, కిరణ్, కృష్ణ రాజు, ప్రధాన కార్యదర్శులు జగన్, పెంజర్ల వెంకట్ రెడ్డి, విమల్ శర్మ, శ్రీకాంత్ చారి, రాము, భరత్, సతీష్, హరి, విజయ్, శివ, విజయ స్వామి, శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శేఖర్ శెట్టి, రాజు, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# నాణ్యమైన విద్య అందించే సంస్థలకు ప్రోత్సాహం



ఇది కద నిజం,సికింద్రాబాద్ :పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే విద్య సంస్థలను తగిన విధంగా ప్రోత్సహిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితఫలమండీ లోని శ్రీ సాయి విద్యాలయం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సితఫలమండీ ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయం వద్ద ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 39 సంవత్సరాలుగా సికింద్రాబాద్ విద్యార్థులకు సాయి విద్యాలయం గ్రూపు సంస్థలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# పెండింగ్ రైల్వే పనులను సత్వరమే చేపట్టాలి

## చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



ఇది కద నిజం,న్యూఢిల్లీ: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ROB), అండర్ బ్రిడ్జిల (RUB) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస్ కుమార్ జైన్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కోర్టు, రామయ్య గూడా ప్రాంతాల్లో డీపీఆర్‌లు పూర్తయిన బ్రిడ్జిల పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, నావంద్గి రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలని, కొండకల్, మర్పల్లి, శంకర్పల్లి సహా పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు. దీనిపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.


# విద్యార్థులను ప్రోత్సహించడం అందరి బాధ్యత



ఇది కద నిజం,సికింద్రాబాద్: చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. బుధవారం మోండా మార్కెట్‌లోని తన నివాసంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చదువుకో తెలంగాణా..' ప్రోత్సాహక పథకం గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులు భాస్కర్ గౌడ్, రాజశేఖర్ రావు, పరమేశ్వర్ రావు, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మినపల్లి కలాన్‌లో వీధి దీపాల వెలుగులు

## సమస్యను పరిష్కరించిన సర్పంచ్ వెంకటమ్మ



ఇది కద నిజం: నవాబుపేట్ మండలం మినపల్లి కలాన్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను సర్పంచ్ వెంకటమ్మ సత్వరమే పరిష్కరించారు. గ్రామంలో రాత్రి సమయాల్లో వీధి దీపాలు లేక బయటకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆమె, గ్రామంలోని ప్రధాన వీధుల్లో కొత్తగా వీధి దీపాలను ఏర్పాటు చేయించి వెలుగులు నింపారు. సర్పంచ్ చొరవతో తమ సమస్య తీరడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటమ్మ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధియే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పెద్దల సలహాలు తీసుకుంటూ వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వీధి దీపాలతో పాటు, గ్రామంలో మురుగు కాలువల వల్ల దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజయ్య, తెలంగాణ ఉద్యమకారుడు కావాలి శేఖర్, గ్రామ సెక్రటరీ, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై రాహుల్ గాంధీ యుద్ధభేరి



న్యూఢిల్లీ: పార్లమెంట్ సాక్షిగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బడ్జెట్ మరియు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత తీవ్రమైన స్వరంతో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశ ప్రజల సమస్యలను విస్మరించి, కేవలం కొద్దిమంది కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్రం పనిచేస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

రాహుల్ గాంధీ ప్రసంగంలోని కీలక విమర్శలు

యువత భవిష్యత్తుతో చెలగాటం: దేశంలో నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరుకుందని, డిగ్రీలు పట్టా పుచ్చుకున్న యువత ఉద్యోగాలు లేక రోడ్లపై పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన పథకాలు యువతను కూలీలుగా మారుస్తున్నాయని మండిపడ్డారు.

భయం – అభయం: "మీరు దేశంలో భయాన్ని వ్యాపింపజేస్తున్నారు.. కానీ భారతదేశపు ఆత్మ భయపడదు" అంటూ రాహుల్ గాంధీ కేంద్రాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, దానిని కాపాడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రైతుల ఆవేదన: కనీస మద్దతు ధర (మీఎస్పీ) కోసం రైతులు రోడ్లపై పోరాడుతున్నా కేంద్రానికి కళ్లు కనబడటం లేదని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు.

కార్పొరేట్ కొమ్ముకాపు: దేశ సంపదనంతా ఇద్దరు ముగ్గురు పారిశ్రామికవేత్తల చేతుల్లో పెడుతున్నారని, పేదలు మరింత పేదలుగా మారుతుంటే, ధనవంతులు మరింత పెరిగిపోతున్నారని ఆరోపించారు.

మణిపూర్ అంశం: మణిపూర్ మండుతున్నా ప్రధాని అక్కడకు వెళ్లకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది దేశ ఐక్యతకు విఘాతమని పేర్కొన్నారు.

సభలో తీవ్ర ఉత్కంఠ

రాహుల్ గాంధీ ప్రసంగిస్తున్న సమయంలో అధికార పక్షం నుండి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మంత్రులు, బీజేపీ సభ్యులు ఆయన మాటలను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అయితే, స్పీకర్ జోక్యం చేసుకుని సభను సముదాయించాల్సి వచ్చింది.

ప్రజాస్వామ్య గొంతుకగా రాహుల్..

ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, ఆయన లేవనెత్తిన అంశాలు సామాన్య ప్రజల గొంతుకగా ఉన్నాయని ప్రతిపక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రసంగం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

# కేబినెట్ సమావేశంలో 24 అజెండా అంశాలకు ఆమోదం



అమరావతి, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మొత్తం 24 అజెండా అంశాలపై చర్చించిన కేబినెట్, రాష్ట్రవ్యాప్తంగా నీటి పారుదల శాఖలో రూ.7,189 నిర్వహణ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలపడంతో పాటు, సామాన్యులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా గాజువాక రెవెన్యూ పరిధిలో వెయ్యి చదరపు గజాల లోపు క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో ఆరు నెలలు పొడిగించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లోని నివాస ఆక్రమణల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకునే గడువును జూన్ 30 వరకుత పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

మరోవైపు పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ పెద్దపీట వేసింది. కృష్ణా జిల్లా కీసరపల్లిలో కస్టమ్స్ కమిషనరేట్ కార్యాలయ నిర్మాణానికి భూ కేటాయింపుల్లో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇంధన రంగంలో భాగంగా ఏలూరు జిల్లా తోటపల్లిలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ కోసం 45.60 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం 1500 ఎకరాల భూమిని చీ=జుణజూరాకు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఈ సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి ఎకరాకు ఏడాదికి రూ.31,000 లీజ్ చెల్లించేలా ఒప్పందం కుదిరింది. వీటితో పాటు సాంకేతిక రంగాన్ని ప్రోత్సహిస్తూ 'ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్' ప్రారంభానికి, తిరుపతిలో APSDC కోసం 'డిజాస్టర్ రికవరీ సెంటర్' ఏర్పాటుకు మంత్రిమండలి పచ్చజెండా ఊపింది.

# కొత్త సంప్రదాయానికి తెర తీసిన మంత్రి లోకేష్

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కుటుంబాలతో 'ఆత్మీయ విందు'



అమరావతి, ఫిబ్రవరి 11: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంత్రి నారా లోకేష్ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయాలే కాకుండా, ప్రజాప్రతినిధులతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీల కుటుంబ సభ్యులతో ఆయన నిర్వహిస్తున్న 'ఆత్మీయ విందు' సమావేశాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు అంటే రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో వేడెక్కుతుంటాయి. కానీ, ఈ ఉత్కంఠ మధ్య ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులను గౌరవిస్తూ లోకేష్ తీసుకున్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ప్రతిరోజూ ఒక పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు వారి కుటుంబ సభ్యులను లోకేష్ విందుకు ఆహ్వానిస్తున్నారు. ఈ విందు భేటీలు నేతల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడానికి ఒక వేదికగా మారడంతో పాటు నియోజకవర్గాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై లోకేష్ దిశానిర్దేశం చేస్తున్నారు.

